మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## దరఖాస్తుల ఎంట్రీని వేగవంతంగా చేపట్టాలి

■ జిల్లా కలెక్టర్ బిఎం. సంతోష్



**ధరూర్ జనవరి 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్చర్ల గ్రామంలో ప్రజాపాలన అభయ హస్తం ఆరు గ్యారంటీలకు ఆఖరి రోజు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ, డేటా ఎంట్రీ కేంద్రాన్ని పరిశీలించి, దరఖాస్తుల డేటా ఎంట్రీ వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బిఎమ్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని ధరూర్ మండలం పార్చర్ల గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో అభయహస్తం దరఖాస్తు స్వీకం^ణలో పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థులు ఇచ్చే దరఖాస్తు లను పూర్తిగా వెరిఫై చేసి తీసుకోవాలని అన్నారు. గ్రామంలో రేషన్ కార్డులు ,కుటుంబాల గురించి ఎంపీడీవో ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 548 రేషన్ కార్డు దారులు, 484 కుటుంబాలు ఉన్నాయని ఎంపీడీవో తెలి పారు. ఇప్పటి వరకు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 50 శాతం వరకు దరఖాస్తులు అందాయని మండల అధికారులు తెలిపారు. దరఖాస్తు ఫారాలు అందరికీ ఇచ్చారా, వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా దర ఖాస్తులు స్వీకరించగా వాటిని పరిశీలించారు. అనంతరం ధరూర్ మండలంలో ఎంపి డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల డిజిటలైజేషన్ ను పరిశీ లించారు. మండలంలో మొత్తం 7 డేటా ఎంట్రీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలపగా, డేటా ఎంట్రీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. మొత్తం 10 వేల దరఖాస్తులలో ప్రతి రోజు 1000 దరఖాస్తుల వరకు డేటా ఎంట్రీ చేపట్టాలని కలెక్టర్ ఆపరేటర్లకు ఆదేశించారు. దరఖాస్తుల ఎంట్రీ ప్రక్రియ 17వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. ఒక్కో సెంటర్‌లో ఒక ఆపరేటర్ కనీసం 1000 దరఖాస్తుల వరకు ఎంట్రీ చేయాలన్నారు. డేటా ఎంట్రీ కేంద్రాలలో విద్యుత్, ఇంటర్నెట్ కంప్యూటర్ సౌకర్యాలు ఉండేలా చూడాలని ఎంపీడిఓ కు ఆదేశించారు. ప్రతి గ్రామ, మండల సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తు డేటా ఎంట్రీ ని ఈ నెల 17 వ తేది లోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ రమేశ్ బాబు, ఎంపీడీవో జబ్బార్, దర్సేల్లి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 06 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ చాంబర్ లో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరిం టెండెండెంట్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో పరిశుభ్రతలను పాటించాలన్నారు. స్టాఫ్ నర్సుల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. కొత్త వైద్యుల నియామకం ఎంత వరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. కోస్గి ఆసుపత్రికి పరికరాలు వచ్చాయా? అని అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నా రు. సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంజిత్‌కుమార్, ఆర్ఎంఓ పాని తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణ అవగాహన పోస్టర్ విడుదల



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 06 ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల మీద నిఘా పెట్టి జిల్లాలో ఎటువంటి మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. మాదక ద్రవ్యాలతో మసి... వాటిని మానేస్తే జీవితం ఖుషి అనే పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మాదక ద్రవ్యాలను నివారించడానికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిషేధంపై ఉక్కుపాదం మోపుతుందని, జిల్లాలోకి మాదక ద్రవ్యాలు రాకుండా అరికట్టాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. మాదక ద్రవ్యాల అరికట్టడం ఎలా అనే దాని మీద దిశా, నిర్ధేశం చేశారు. మాదక ద్రవ్యాల మీద స్పెషల్ డ్రైవ్‌నీ కూడా త్వరలో నిర్వహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. పోస్టర్ విడుదలలో అడిషనల్ ఎస్పీ, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

■ నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



ఎంపిడిఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 6 ప్రభాతవార్త:** శనివారం నారాయణపేట ఎంపిడిఓ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ పరిశీలించారు. ఈసంద ర్భంగా డాటాఎంట్రీ ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా చేయాలని సూచించారు. ప్రతిరోజు టీం వర్క్ ఇచ్చిన టార్గెట్ ప్రకారం డాటా ఎంట్రీ నిర్వహించాలన్నారు. అనంతరం ధన్వాడ, మరికల్ ఎంపిడిఓ కార్యాలయాలలో డాటా ఎంట్రీలను పరిశీలించి ఎన్ని ఎంట్రీ చేశారని అడిగి తెలుసుకున్నారు. డాటా ఎంట్రీకి సిబ్బంది తక్కువ అయిన పక్షంలో రెవెన్యూ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. మక్తల్ మున్సిపాలిటీ కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలించారు. ఈనెల 12లోపు డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు.

## బాలానగర్ ఘటన దురదృష్టకరం

- బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- తన సొంతంగా ఒక్కో కుటుంబానికి రూ. 50 వేలు అందజేత



దవాఖాన ఆవరణలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 06 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని ఎమ్మెల్యే అని రుధ్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందేలా చూస్తానని భరోసానిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదికి వెళ్లి అక్కడ పరిశీలించారు. 5 మంది మృతి చెందడం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 వేల ఆర్థిక సాయం అందిస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎక్స్‌గ్రేషియా గురించి మాట్లాడి వారికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందేలా చూస్తానని తెలిపారు.

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ● దవాఖానలో బాధితుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాత వార్త:** బాలానగర్ ఘటనలో బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానకు చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులను పరామర్శించి ధైర్య చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు.

# తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు సహకరించాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 6, ప్రభాతవార్త:** తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. 2024 స్పెషల్ సమ్మరీ రివిజన్ పై శనివారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ సిద్ధం చేసిన ముసాయిదా ఓటర్ జాబితాను శనివారం ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జాబితాను రాజకీయ పార్టీలకు, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉంచడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాలో ఓటర్లు, తమ పేర్లను పరిశీలించుకుని ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దకోడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ముసాయిదా జాబితాలో తప్పులు గుర్తిస్తే చేయాల్సిన మార్పులను జనవరి 22వ తేదీ నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మార్పులు సవరించి ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ మధ్య కాలంలోనే ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోని వాళ్లకు ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. మరణించిన వారి పేర్లను లేదా ఈ ప్రాంతం నుండి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళిన వారిని గుర్తించి ఫారం 7 ద్వారా పరిశీలన చేసి తగిన ఆధారాలతో పేర్లను జాబితా నుండి తొలగించడం జరుగుతుందని తెలియజేశారు. మరణించిన వారి ధ్రువీకరణ పత్రము లేని పక్షంలో స్థానిక సంస్థల కార్యాలయ రిజిస్టర్లలో నమోదు అయిన జనన మరణాలను వివరాలను పరిగణలోకి తీసుకొని పూర్తి విచారణ అనంతరం పేర్లను తొలగించడం జరుగుతుందన్నారు. రాజకీయ ఎపార్టీలు స్వయంగా తమ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు లేదా పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు వంటివి ఉంటే ప్రతిపాదనలు ఇవ్వాలని రాజకీయ పార్టీంప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తుతం ఉన్న బి.ఎల్.ఒ ల పనితీరును సమీక్షించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లోకల్ బాడీస్ సంచిత్ గాంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్. తిరుపతి రావు, రాజకీయపార్టీల నుంచి సిపిఎం తరపున పరమేశ్వర చారి, బిజెపితరపున దాసోజు శ్రవణ్, ఐఎన్‌సి తరపున త్రినాథ్, బిఆర్ఎస్ తరపున సయ్యద్ జమీల్, టిడిపి తరపున బాలరాజు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలు చేర్చాలి

● కేంద్రంతో చర్చిస్తాం ● బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ● పాలమూరులో వాల్మీకి బోయల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 06 ప్రభాతవార్త:** వాల్మీకి బోయల ప్రధాన డిమాండ్ ఎస్టీ జాబితాలో చేర్చాలని అంశం దాన్ని భారత ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ వాల్మీకి సోదరులకు హామీ ఇచ్చారు. అయోధ్య నగరంలో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం నామకరణం చేసినందుకు శనివారం తెలంగాణ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో భారత ప్రధానికి నరేంద్రమోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ పాలమూరు పట్టణంలో భారీ ఎత్తున శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డికె అరుణమ్మ, రాష్ట్రనాయకులు, బిజెపి పాలమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఏపి మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ అయోధ్యలో విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం నామకరణం చేసి భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభం చేయడం శుభపరిణామం అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞత భావంతో తెలంగాణ వాల్మీకి సంఘం పాలమూరు పట్టణంలో సీతారామ లక్ష్మణ మహర్షి వాల్మీకి వేషధారణలో బ్రహ్మాండమైన శోభాయాత్ర నిర్వహించడం అందులో పాల్గొనే అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరాముని జన్మస్థలమైన అయోధ్య నగరంలో రాముడి మందిర నిర్మాణం కోసం గతకొన్ని వందల సంవత్సరాలుగా ఉన్న సమస్యను పరిష్కరించడంతో దివ్యమైన భవ్యమైన రాముడి మందిరం భారత దేశంలోని హిందువులంతా కలిసి నిర్మించుకోవడం జరిగిందన్నారు. ఈనెల 22వ తేదీన అయోధ్య నగరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని, ఆ రోజున భారతదేశంలోని ప్రతి దేవాలయంలో ప్రతి ఇంటిలో రామజ్యోతులు వెలిగించి దీపావళి సంబరాలు జరుపుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని ఆమె అన్నారు. రాష్ట్రానికి వస్తే తెలంగాణలోని వాల్మీకి బోయలు బిసిలు ఏలో ఉన్నారు. మిగతా రాష్ట్రాల్లో ఎస్సీలుగా, ఎస్టీలుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ జ్ఞానపీఠము, శ్రీశ్రీశ్రీ మహా మృత్యుంజయ పంచముఖ ఆంజనేయస్వామి అంతర్జాతీయ తత్వజ్ఞాన ధర్మ ప్రచారకర్త మహర్షిశ్రీరగోతమాచార్యులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు రాచాల జనార్దన్, నలిగేసి లక్ష్మినారాయణ హనుమంతు, తెలంగాణ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది కురుమయ్య, ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ పెద్ద నర్సింలు, జిల్లా అధ్యక్షులు పొన్నకల్ కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర నర్సింలు, జిల్లా కోశాధికారి కె. సతీష్‌కుమార్, తెలంగాణ వాల్మీకి సంఘం యువసేన జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, నాగరాజు, బోయ రమేష్, సాయిపవన్, యాదయ్య, సత్యం, వెంకటయ్య, అల్లన్న, దాసు, రాఘవేంరద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 10కి చేరిన పాజిటివ్ కేసులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాతవార్త:** కొవిడ్ వైరస్ మళ్లీ మెల్లెమెల్లెగా వ్యాపిస్తున్నది. రోజురోజుకు కేసులు సంఖ్య పెరుగుతున్నది. శుక్రవారం వరకు 7ఉన్న పాజిటివ్ కేసుల సంఖ్య నేడు 10కి చేరింది. గురువారం 141శాంపిళ్లు పరీక్షకు పంపించడగా అందులో 3 పాజిటివ్‌గా నిర్ధరణ అయినట్లు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డా జీవన్ తెలిపారు. శుక్రవారానికి 497శాపిళ్లు సేకరించి పరీక్షలకు పంపించగా ఏడు పాజిటివ్‌గా నిర్ధరణ అయిన సంగతి తెలిసిందే. కొవిడ్ వైరస్ వ్యాప్తి మళ్లీ పెరగడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. బయటికి వెళ్తే మాస్క్ తప్పనిసరి అని, జలుబు దగ్గు, ఒంటి నొప్పులు, జ్వరం లాంటి లక్షణాలు ఉంటే టెస్టులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

## మండలంలో పెట్రేగిపోతున్న దొంగలు

- కొట్రలో 17 ఇండ్లలో చోరీ...
- నెల రోజుల వ్యవధిలోనే 34 ఇండ్లకు కన్నం వేసిన దొంగలు..



క్లూస్ టీంతో వివరాలు సేకరిస్తున్న దృశ్యం



రోధిస్తున్న కడారి పార్వతమ్మ

**వెల్దండ, జనవరి 06 ప్రభాతవార్త:** ఈ మధ్య కాలంలో మండలంలో రోజు రోజుకు దొంగలు చెలరేగిపోతూ పోలీసులకే సవాల్ విసురు తున్నారు. గత నెల తిమ్మినోనిపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇంట్లను గుర్తించి పగులగొట్టి దోచుకెళ్లిన సంఘటన మరువక ముందే కొట్ర గ్రామంలో తాళాలు వేసిన 17 ఇండ్లను శుక్రవారం రాత్రి గుర్తించి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్ప డిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కొట్ర గ్రామంలో అర్ధ రాత్రి దొంగలు భీభత్సం సృష్టించి తాళం వేసిన ఇండ్ల ను లక్ష్యంగా దొంగలు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కడారి పార్వతమ్మ తన కూతురు కొడుకు జన్మ దిన వేడుకలకు తన కొడుకు గణేష్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఊరికి వెళ్లగా... ఇదే అదునుగా భావించిన దొంగలు పార్వతమ్మ ఇంట్లో చోరబడి బీరువాను ధ్వంసం చేసి రూ. 3,80లక్షల నగదు, 5తులాల బంగారు అభరణాలను దోచుకెళ్లినట్లు బాధితురాలు తెలి పారు. ప్రధానంగా తాళాలు వేసిన ఇండ్లనే గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కాలనీకి చెందిన ఎం. జంగమ్మ ఇంట్లో ఒక తులం బంగారం పత్తిలు, 20 తులాల వెండి గొలుసులు, కావటి కృష్ణయ్య ఇంట్లో2 తులలకు పైబడి బంగారం, బచ్చాల అక్కమ్మ ఇంట్లో రూ. 20వేల నగదు, బంగారు చెవుల పుల్లలు, తిర్మన్‌దాస్ అనుసూయమ్మ ఇంట్లో రూ. 11వేల నగదు, 5 తులాల వెండి గొలుసులు, భూత్కురి వెంకటమ్మ ఇంట్లో 4వేలనగదు, బి. యాదమ్మ ఇంట్లో రూ. 2 వేలు, ఎం. పద్మ ఇంట్లో బీరువా ధ్వంసానికి ప్రయత్నించగా బీరువా తెరుచుకోలేదు. ఎం. లక్ష్మమ్మ, శ్రీరాములు, వెంకటయ్య ఇండ్లలో కొన్ని దస్తావేజులు, కుప్ప చైతన్య ఇంట్లో 14తులాల వెండి వస్తువులు, శ్యాంపురి యాదయ్య ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించి వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ కుమారస్వామిలు సంఘటన స్థలానికి చేరుకొని జిల్లా నుంచి క్లూస్ టీంను పిలిపించి దొంగల వివరాలను సేకరించారు. మండలంలో ఏ గ్రామంలో చోరీలకు పాల్పడుతారో తెలియక మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. తూతూ మంత్రంగా పోలీసులు గస్తీలు నిర్వహించకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలని, ఇప్పటికైనా పోలీసులు తేరుకొని మండలంలో పటిష్ట నిఘాను ఏర్పాటు చేసి దొంగల బెడదను నివారించాలన్నారు.

# ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం!

సబ్సిడీ గొర్రెల కోసం కట్టిన డబ్బులకు దరఖాస్తు పెట్టుకుంటే తిరిగి ఇచ్చేస్తాం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 6, ప్రభాతవార్త:** రాజకీయాలతో పంబంధం లేకుండా వనపర్తి మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అదేవిధంగా సబ్సిడీ గొర్రెల కొరకు కట్టిన డబ్బులకు దరఖాస్తు పెట్టుకుంటే తిరిగి ఇచ్చేస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు చివరి రోజైన శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని 8వ వార్డు శ్రీనివాసపురంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా వనపర్తి మున్సిపాలిటీలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసి వనపర్తి మున్సిపాలిటీ ని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని అందుకు అందరూ వార్డు కౌన్సిలర్లు కలిసి రావాలని సూచించారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రమని అంతా అభివృద్ధి చేసేశామని ప్రకటించారు. కానీ ప్రజల సమస్యలు తెలుసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమం పెట్టి దరఖాస్తులు స్వీకరించగా ఇప్పటి వరకు దాదాపు 17 వేల దరఖాస్తులు వచ్చాయని దీని బట్టి గత ప్రభుత్వ పని తీరును అంచనా వేయవచ్చు అన్నారు. శ్రీనివాసపురంలో తన ఇల్లు ఉందని అందువల్ల స్వంత ఊరుగా భావించి ఇక్కడి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు కౌన్సిలర్ వార్డు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగ వాటి పై స్పందించారు. రోడ్డు విస్తరణ, డబుల్ బెడ్ రూం ఇల్లు, డ్రైనేజీ సమస్య, స్మశాన వాటికి తదితర సమస్యలు ఏమున్నాయో పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డిని ఆదేశించారు. గత ప్రభుత్వం లో సబ్సిడీ గొర్రెల కొరకు డబ్బులు కట్టి ఇప్పటీ వరకు గొర్రెలు మంజూరు కానీ వారి సమస్య పై ఇప్పటికే జిల్లా కలెక్టర్ తో మాట్లాడటం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండాలో గొర్రెల పథకం లేనందున డబ్బులు కట్టిన వారు దరఖాస్తు ఇస్తే కట్టిన డబ్బులు తిరిగి చెల్లించడం నిధుల పై రాష్ట్ర ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడటం జరిగిందని నిధులు యదావిధిగా మంజూరు చేసేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు. భారాసలో పని చేసిన తాను ఆత్మగౌరవం కొరకు పార్టీని వీడానని అందువల్ల ఎవరి ఆత్తగౌరవం దెబ్బతినకుండా అందర్నీ సమానంగా చూస్తానని తెలియజేశారు. ప్రోటోకాల్ అనేది తప్పకుండా పాటిస్తామని, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ నుప్రజా పాలనకు ఆహ్వానించవద్దని నేను ఏ అధికారికి చెప్పలేదని వివరించారు. సి. యం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మిచెక్కులు ప్రజల వద్దకే వెళ్లి ఇస్తామని తెలియజేశారు. ప్రజా పాలన కార్యక్రమానికి అధికారకంగా శనివారం చివరి తేదీ అయినప్పటికీ నీ ఇంకా ఇవ్వని వారు ఉంటే ప్రభుత్వ కార్యాలయాల్లో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రజాపాలన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఆహ్వానించలేదని అందుకే రాలేదన్నారు. ఇప్పుడు 8వ వార్డు కౌన్సిలర్ విభూతి నారాయణ పిలవడం వల్ల కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందన్నారు. పట్టణ అభివృద్ధిలో వివక్ష లేకుండా అభివృద్ధి చేసుకుందామని, తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం రద్దు చేసినందున అప్పటి లబ్దిదారులు, దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని శాసన సభ్యులను కోరారు. అదేవిధంగా గొర్రెల యూనిట్లకు డిడి లు కట్టిన వారికి తిరిగి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీకి గత ప్రభుత్వం మంజూరు చేసిన 50 కోట్ల నిధులను యదావిధిగా మంజూరు చేయించి పట్టణ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. అనంతరం ఎంపీపీ కిచ్చా రెడ్డి మాటాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల్లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రజాపాలన తీసుకురావడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వార్డు కౌన్సిలర్ విభూతి నారాయణ ఇతర కౌన్సిలర్లు, జయసుధ, బండారు రాధాకృష్ణ, చిర్ల సత్యం సాగర్, లక్ష్మి, కైరున్ షఫీ, నాగన్న యాదవ్, లక్ష్మి నారాయణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, మాజీ సర్పంచి రాములు పాల్గొని మాట్లాడారు.

## ముగిసిన ప్రజాపాలన దరఖాస్తులు



ప్రజాపాలన దరఖాస్తులను తీసుకుంటున్న ఆర్డీఓ చంద్రకళ

**ఇటిక్యాల, జనవరి 06 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా ప్రభుత్వంలోకి రాగానే అభయహస్తం పథకం కింద ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అమలు చేసి అందిస్తామని హామీ ఇవ్వడంతో అందులో భాగంగా వారం రోజులపాటు గ్రామాలలో ప్రజల నుండి ప్రజాపాలనలో భాగంగా సంక్షేమ పథకాల కొరకు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమం శనివారం ఎర్రవల్లి మండలంలోని బి. వీరాపురంలో నిర్వహించగా ఆర్డీఓ చంద్రకళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమం నేటితో ఎర్రవల్లి మండలంలో ముగిసింది. అలాగే శుక్రవారం రోజే ఇటిక్యాల మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమం ముగిసింది. చివరిరోజు బి. వీరాపురంలో జరిగిన ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం కింద 275 దరఖాస్తులు, ఇతర సమస్యల కోసం 146 దరఖాస్తులు వచ్చినట్లు ఇంచార్జి తహసిల్దార్ నందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి తహసిల్దార్ నందిని, ఆర్ఐలు ప్రశాంత్‌గౌడ్, నరేష్, సర్పంచ్ రాముడు, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, అలాగే పంచాయతీ ర్యదర్శి టీం సభ్యులు, వైద్యసిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● యువకుడి మృతి ● మరొకరికి తీవ్ర గాయాలు

**పానగల్, జనవరి 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బండపల్లి స్టేజి సమీపంలో ఎదురుగా వస్తున్న బైకులు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది ఎస్సై వేణు తెలిపిన వివరాల ప్రకారం పిల్ల రాళ్లపల్లి తండాకు చెందిన మహేష్ గౌతమ్ లు పానగల నుండి తరిగి ఊరికి వెళుతుండగా కొల్లాపూర్ నుండి వనపర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుట్టపల్లి స్టేజి సమీపంలో ఢీకొనడంతో బైకు పై ఉన్న యువకుడు మహేష్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన ప్రాంతంలో హైదరాబాదులోని ఏఐజి హాస్పిటల్కు తరలించినట్లు తెలిపారు. మృతుని తల్లి చాందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.



# అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తాం

- 48 గంటల్లోనే రెండు పథకాలు అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్ల నిర్మాణం చేపడతాం...
- మీ మండలానికి వచ్చి సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ చేస్తాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




రేవల్లి మండల కేంద్రంలో ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి,జనవరి 6,ప్రభాతవార్త:** నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజలకు వివరించారు. శనివారం రేవల్లి మండల కేంద్రంలో,పెద్ద మందడి మండలం జగత్ పల్లి గ్రామంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో వేరువేరుగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు పథకాలు అమలు చేశామని మిగిలిన గ్యారంటీలు మూడు నెలల్లోనే పూర్తిగా అమలు చేస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి దరఖాస్తు ఫారం అందజేశారని గ్రామ ప్రజలందరూ తొందర లేకుండా దరఖాస్తు చేసుకోవాలని ఇది ఇందిరమ్మ రాజ్యమని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎవరి మాటలు నమ్మవద్దని అన్నారు.అదేవిధంగా 6 గ్యారంటీలలో ఉన్న మహాలక్ష్మి పథకం ప్రతి ఆడబిడ్డకు 2500 రూపాయలు ఈ నెలాఖరులోగా అమలు చేస్తామని అన్నారు.వీటితోపాటు చేయుత పథకం రైతు భరోసా పథకం అమలు చేస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదట ఇల్లు లేని పేదలకు తర్వాత రేకుల ఇల్లు తర్వాత మట్టి మిద్దెలు ఉన్న ఇండ్లకు ప్రాధాన్యత ఇస్తూ అందరికీ ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్ల నిర్మాణం చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు.సంక్రాంతి పండుగ లోపు అన్ని గ్యారంటీలు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతుందని సంక్రాంతి తర్వాత ఇండ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభిస్తామని వాటికి సంబంధించిన నియమ నిబంధనలు సిఎం ప్రకటిస్తారని అన్నారు.మీకు అండగా ఉన్నారని ఎవరు భయపడవద్దని అందరికీ అన్ని పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ ప్రజా పాలనలో ఇంకా ఏమైనా రేషన్ కార్డుల గురించి గానీ ధరణి పోర్టల్ గురించి గానీ సమస్యలు ఉంటే అధికారులకు ఒక తెల్ల కాగితం పై రాసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు.రేవల్లి మండలంలో ఇప్పటికే ఐదువేల నుండి 6000 వరకు దరఖాస్తులు వచ్చియని శనివారం కూడా 1000 కి పైగా దరఖాస్తులు వస్తాయని ఎలాంటి సమస్యలు లేకపోతే దరఖాస్తులు ఎందుకు వస్తున్నాయో గత ప్రభుత్వ పాలకులు ఆలోచన చేయాలని అన్నారు.గత పాలకులు ఎవరూ ఉలికి పడ్డొద్దని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి గెలిచాడని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని కొంత మంది ఎగసిపడుతున్నారని వారు తగ్గించుకోవాలని అన్నారు.మాజీ మంత్రి హయాంలో జెడ్పీ చైర్మన్ నుండిఎంపీపీ జడ్పిటిసి సర్పంచ్ వార్డు నెంబర్ వరకు ఎవరికీ ఎలాంటి అధికార ఇవ్వకుండా తానే అనుభవించాడని ఇక్కడ ఈయన అక్కడ కేసీఆర్ఇద్దరు దోచుకొని భవనాలునిర్మించుకున్నారని ఆశలు కూడబెట్టుకున్నారని వాటన్నింటినీ బయటికి తీస్తామని అన్నారు.గత పాలకులకు పొలాలు గుట్టలు ఏవి సరిపోలేదని అన్ని దోచుకొని ఆస్తులు కూడా పెట్టుకున్నారు.వాటి చిట్టా నా దగ్గర ఉందని వాటిని కక్కిస్తామని హెచ్చరించారు.ఈ ప్రభుత్వంలో మనంఅన్ని స్థాయిలో ఉన్నప్రజాప్రతినిధులకు కల్పిస్తామని అది కాంగ్రెస్ ప్రభుత్వం మరియు మేఘా రెడ్డి బాధ్యత అని అన్నారు. ఇంతకు ముంతు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులకు రాత్రికి రాత్రే ఆటోలు మాట్లా దుకుని వనపర్తికి వెళ్లేవారని ఇప్పుడు నేనే ఎమ్మార్వో ఆఫీస్ కు వచ్చి మండ లంలోని చెక్కులు అందజేస్తానని పైరవీకారులు బ్రోకర్లు అవసరం లేదని మీ బిడ్డ మేఘారెడ్డి వచ్చి అందజేస్తారని.ప్రజలుఎవరు ఇబ్బందిపడొద్దు అనివారికీ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూజాత తహసిల్దార్ లక్ష్మీదేవి స్పెషల్ ఆఫీసర్ దేశ నాయక్ గ్రామ సర్పంచ్ గౌతమ్ జెడ్పిటిసి భీమన్న సింగిల్ విండో చైర్మన్ రఘు యాదవ్ ఎంపీటీసీఅంజనమ్మ కోఆప్షన్ సభ్యులుకాజా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సత్యశీల రెడ్డి మండల ప్రెసిడెంట్ వాడల పర్వతాలు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుపర్వతాలు కాంగ్రెస్ పార్టీ నాయకులుకార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**మక్తల్,జనవరి 06 ప్రభాతవార్త:** మక్తల్ తహసిల్దార్ కార్యాలయంలో మక్తల్ నియోజకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడుదల చేసిన ఎలక్ట్రోల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఏమైనా ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ వరకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాలను స్వీకరించి పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి మాసం 8వ తేదీనాడు ప్రకటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల ప్రతినిధులకు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా పరిపాలనలో చివరి రోజు ధరఖాస్తుల వెల్లువ



**కొత్తకోట,జనవరి 6,ప్రభాతవార్త:** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా హాభయహస్తం 6 గ్యారెంటీల శనివారం చివరి రోజు దరఖాస్తులు జోరుగా వచ్చాయని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు,11వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మిషేక్ దరఖాస్తు సెంటర్ ను సందర్శించి తెలిపారు.దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోటలో గత 10 రోజులుగా నిర్విరామంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.అలాగే వార్డు ఆఫీసర్ జయరామ్,అంగన్వాడీ టీచర్ నారమన్ దీనమ్మ,ఆశ వర్కర్ జనంపల్లి భాగ్యమ్మ హృదపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే కాంగ్రెస్ నాయకులు జే.రత్నం,జూదం కర్ణ,14వ వార్డు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మనిగిల్ల భాస్కర్,కొమ్ము సజ్జనం,మంద సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన గ్రామసభలు



రాయిచేడులో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల,జనవరి 06ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం గ్రామసభలు గతనెల 28 నుంచి 6 వరకు నిర్వహించిన సమావేశాలు శనివారం ముగిశాయి. ముగింపు రోజైన శనివారం మండలంలోని లక్ష్మాపూర్, రాయిచేడు, సూర్యతండాలో గ్రామ సర్పంచ్‌లు కాల్వ పుష్ప గోవర్ధన్‌రెడ్డి, బాల్‌లింగయ్య, ముత్యాలు అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. గ్రామ సభలకు ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, మండల పంచాయతీ అధికారి నారాయణ టీం లీడర్‌గా పనిచేశారు. గ్రామసభలను మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌జీ పర్యవేక్షించారు. ముగింపు రోజు జరిగిన గ్రామసభలో 818 దరఖాస్తులు అందాయని, 274 కారణ సమస్యలపై అందిన దరఖాస్తు ఉన్నాయని ఎంపిడిఓ లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మణ్‌రావుతో పాటు మండల పంచాయతీ అధికారి నారాయణ, సర్పంచ్‌లు కాల్వపుష్ప గోవర్ధన్‌రెడ్డి, బాల్‌లింగయ్య, ముత్యాలీ, సేవ్యనాయక్, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు, టేబుల్ ఇంఛార్జి పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**కోయిల్‌కొండ,జనవరి 06 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర యుటిఎఫ్ విద్యా శాఖ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రమైన కోయిలకొండలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు వి.శంకరయ్య చేతుల మీదుగా మండల యుటిఎఫ్ అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి మొగులయ్యలు ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెట్ నుంచి ఉపాధ్యాయ లోకానికి మినహాయింపునిచ్చి ప్రమోషన్లు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యాయ శాఖ కార్యదర్శి శ్రీకృష్ణయ్య, మండల కోశాధికారి రవి బాబు, గౌరవ అధ్యక్షులు ఉసేనయ్య, భీమయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి 06 ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కల్వకుర్తి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కోర్టు భవనం నిర్మించి 90 సంవత్సరాలు పైగా కావడంతో శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితులు మరియు కక్ష్యిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి కోరులో ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు కోర్టు భవనం చేరడంతో వర్షపు నీరు లోపలికి వచ్చి విలువైన దస్తావేజులు పాడు కావడంతో భవిష్యత్తులో తీవ్ర సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, వర్షకాలం రాక ముందే కోర్టు భవనం తాత్కాలిక మరమ్మత్తులకు నిధులు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీనియర్ న్యాయవాది లక్ష్మణశర్మ,లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, కృష్ణయ్య, న్యాయవాదులు వెంకటగౌడ్, అమరేందర్, జమీల్, అహ్మెద్, లక్ష్మణ్, రాజ్, మల్లెపల్లి,జగన్,జయంత్, ఏ.రామగోపాల్, మల్లేష్, బి.మల్లేష్, ఆంజనేయులు, శివకుమార్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వక చర్యలు ఉండవు

- విద్యా వ్యవస్థలో మార్పు కోసమే ఉన్నతి
- ఏంఎంఓ దుంకుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 06 ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థలో మార్పు కోసమే ఉన్నతి లక్ష్యమని ఎఫ్ఎల్ఎన్ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని ఉపాధ్యాయులు అంకింత భావంతో పనిచేసి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలని జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తెలుగు పాఠశాల సముదాయ సమావేశంలో ఏంఎఓ మాట్లాడారు. ఉన్నతి అమలులో కొన్ని ఇబ్బందులు ఎదువుతున్నట్లు ఉపాధ్యాయులు విద్యాశాఖ దృష్టికి తెస్తున్నారని వీటన్నింటిని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ఉపాధ్యాయులపై స్నేహపూర్వక పర్యవేక్షణ తప్ప ఎలాంటి ఉద్దేశ పూర్వక చర్యలు ఉండవన్నారు. పర్యవేక్షణాధికారులు ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తూ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సమిష్టి కృషి జరుగుతుందని ఏఎంఓ అన్నారు. విద్యార్థుల నమోదు కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి అమలు చేస్తున్నదని ఏఎంఓ అన్నారు. విద్యార్థుల హాజరు నమోదుతో పాటు బోధనాభ్యాసన ఫలితాలను కూడా ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు సానుకూల దృక్పథంతో పనిచేస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలో ముందుకు వెళ్తున్నామని త్వరలోనే విద్యార్థులకు ఉపయోగకరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తామని ఆయన అన్నారు. చిన్నచింతకుంట సముదాయాన్ని ధర్మాపూర్‌కు మార్చినందుకు తెలుగు భాషోపాధ్యాయులు ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ధర్మాపూర్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం కృష్ణయ్య, తెలుగు రిసోర్స్ పర్సన్లు పల్లెర్ల రామ్మోహన్‌రావు, కట్టా గిరిజా రమణ, గుముడాల చక్రవర్తిగౌడ్, కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు, బలరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయంచేసి ఎమ్మెల్యే చిత్తశుద్ధిని చాటుకోవాలి

- బాధితులకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి : బిఆర్ఎస్ పార్టీ నాయకులు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**బాలానగర్,జనవరి 06 ప్రభాతవార్త:** బాలానగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షల చొప్పున ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేయాల్సిన అవసరం ఉందని బాలానగర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం ఈ మేరకు వారు మాట్లాడుతూ గతంలో మిడ్జిల్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు రూ. 25 లక్షల చొప్పున అందజేయాలని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని డిమాండ్ చేసిన అనిరుధ్‌రెడ్డి ఇప్పుడు మీరే ఎమ్మెల్యే ఎందుకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేకపోతున్నారో సమాజానికి తెలియాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరోమాట మట్లాడడం ఎంత మాత్రం సమంజసం కాదని సూచిస్తున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా డా. లక్ష్మారెడ్డి గతంలో ఒక్కో బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. ఒక ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించి వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించడం దేనికి సంకేతమో ఎమ్మెల్యే చెప్పాలని మండిపడ్డారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రతిపక్షంలో చెప్పిన మాటలను ఇప్పుడు నిజం చేయాల్సిన అవసరం ఉందని,ఎమ్మెల్యే తనచిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి వెంకటాచారి, పార్టీ ప్రధాన కార్యదర్శి జి.చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మంగలి సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవికుమార్, రవిందర్ నాయక్, ఆచారి, శివ తదితరులు డిమాండ్ చేశారు.

## ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**బిజినేపల్లి,జనవరి 06 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసింది. మొత్తం మండలంలోని మొత్తం 35 గ్రామ పంచాయతీలో గతనెల 28వ తేదీ నుండి జనవరి ఆరువరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల ద్వారా ఆర్జీదారులు అభయహస్తం దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం మండలంలో 18090 గృహాలు ఉండగా అభయహస్తం పథకం ద్వారా గ్రామాల్లో 23,500లు ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపిడిఓ కృష్ణయ్య తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిర ఇల్లు, చేయూత పథకం, రేషన్ కార్డులు, ఇతర పథకాలతో పాటు, తమ సమస్యలపై ఫిర్యాదులు కూడా అధికారులకు అందించారు. ప్రతి నాలు నెలలకు ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు. ప్రజాపాలన గ్రామసభ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఈనెల 17లోపు డేటా ఎంట్రీని పూర్తి చేసినట్లు వివరించారు.





హాకీ క్రీడలతో స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మన్

## హాకీ క్యాంపు పరిశీలన

**కొత్తకోట,జనవరి 6,ప్రభాతవార్త :** ఈ నెల 17వ నుండి 20వ తారీఖు వరకు జరగబోయే హాకీ క్రీడల దృష్ట్యా శనివారం కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు హాకీ క్యాంపు ప్రాక్టీస్ ను స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మన్ పరిశీలించారు.ఈఎంఆర్ఎస్ సొసైటీ ఐటీడీఏ ఉట్నూర్,ఆదిలాబాద్ లో వివిధ సొసైటీ ల మధ్య జరిగే 7 వ ఇంటర్ సొసైటీ లీగ్‌ఇన్ లో హాకీ లో పాల్గొనే విద్యార్థి నుల హాకీ ప్రాక్టీస్ సందర్శించి విద్యార్థులను అభినందించారు.ఈ హాకీ క్రీడలో పాల్గొనే విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు.ప్రాక్టీస్ చాలా అవసరమని ప్రతిరోజు శ్రద్ధతో ఆడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి,పిఈటీలు రాజేశ్వరి,మీన హాకీ కోచ్ వాహీద్‌లు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహ వార్డెన్‌గా రామకృష్ణ

**వెల్దండ, జనవరి 06 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహ వార్డెన్‌గా ఈ.రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కళమ్మ కల్వకుర్తి బీసీ బాలుర వసతి గృహానికి బదిలీ అయ్యింది. ఊర్కొండ మండలంలోని బీసీ వసతి గృహ వార్డెన్‌గా గతంలో రామకృష్ణ బాధ్యతలు నిర్వర్తించారు.

## ప్రజా పాలనతో పేద ప్రజలకు మేలు

**వెల్దండ, జనవరి 06 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5 గ్యారెంటీల పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని పోచమ్మగడ్డతండా సర్పంచ్ వరలక్ష్మి పంతులనాయక్ అన్నారు. మండలంలోని పోచమ్మగడ్డ తండాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని శనివారం జిల్లా డీఆర్‌డీఏ పీడీ నర్సింగ్‌రావు పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పకడ్బందిగా ధరఖాస్తుల పరిశీలన చేయాలని సూచించారు. శనివారంతో ధరఖాస్తుల స్వీకరణ ముగిసిందని, ధరఖాస్తు చేసుకోవాలనుకునే లబ్ధిదారులు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం రాములు నాయక్, ఆర్ఐ శంకర్‌నాయక్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అశ్విని, ఈసీ దేవేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి,ఫయాజ్,మురహరిచారి,స్వప్న, లింగస్వామి, సహదేవ్,లక్ష్మణ్ నాయక్, మహిపాల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**వనపర్తి టౌన్ జనవరి6, ప్రభాతవార్త:** గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం తెలంగాణ రాష్ట్ర బి.సి.స్టడి సర్కిల్ ఆధ్వర్యంలో, జోగులాంబ గద్వాల్ యందు 1,2,3 మరియు 4వ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వనపర్తి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారం బీరం సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన వనపర్తి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఆన్‌లైన్ 52.52225 ద్వారా తేది 8.01.2024 నుండి తేది 20.01.2024 వరకు దరఖాస్తు చేసుకోవలెను. నిబంధనలు: దరఖాస్తు చేసుకునేఅభ్యర్థుల యొక్కకుటుంబ వార్షిక ఆదాయం రూ.5.00 లక్షలు మించరాదు. దరఖాస్తు చేసుకునే అభ్య ర్థులు మీ యొక్క యస్.యస్.సి, ఇంటర్, డిగ్రీ , లేటెస్ట్ క్యాస్ట్, లేటెస్ట్ ఇన్‌కమ్ ఆధార్ కార్డు, ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థు ఎంపిక విధానం రిజర్వేషన్ డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుంది. అమలులో ఉన్న నిబంధనలు ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తారు. ఇంతకుముందు బిసి స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొందిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు అర్హులు కారు. 08546న 293022, 9908560268 లేదా టిటియన్ బిల్డింగ్ పాత యల్.ఐసి ఆఫీసు, మొదటి రైల్వే గేట్ దగ్గర, గద్వాల టౌన్ జోగులాంబ గద్వాల్ జిల్లా నందు ఆఫీసు వేళాలలో సంప్రదించగలరు.

## శనీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**బిజినేపల్లి,జనవరి 6 ప్రభాతవార్త :** నందివడ్డెమాన్ గ్రామంలో మార్గశిర మాసం శనివారం దశమినాడు శ్రీ సార్థా సప్తజేష్ట మాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మరిత్యా, గోచార రిత్యా గ్రహదోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కొరకు శనేశ్వరస్వామిని నువ్వులనూనె, జిల్లెడుపూలు, జమ్మి ఆకులతో పూజలు నిర్వహించాలని అన్నారు. పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం మహాగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అష్టోత్త, అర్చనలు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గోపాల్‌రావు, గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు వీరశేఖర్, ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్,సాయి, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## తపస్ క్యాలెండర్ 2024 ఆవిష్కరణ



**ఉప్పునుంతల,జనవరి 06 ప్రభాతవార్త:** తపస్ క్యాలెండర్ 2024ను శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హైస్కూల్ కాంప్లెక్స్, గెజిటెడ్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా పాల్గొన్న తపస్ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఉద్యోగులకు సిపిఎస్ ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బకాయిగా ఉన్న మూడు డిఏలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఆర్‌సిని అమలు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల చొరవ చూపాలని, అన్ని పాఠశాలలో స్వీపర్లు, స్కావెంజర్లను నియమించాలనిఅదేవిధంగా అన్ని పాఠశాలలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం విద్యారంగ సమస్యలను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్ఎం, గెజిటెడ్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసే పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను విజయవంతం చేసి విద్యార్థుల నుంచి మెరుగైన ఫలితాలను ప్రజలకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగర శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, మండల గౌరవ అధ్యక్షులు కమలేకర్ నాగేశ్వంరావు,మండలతపస్ అధ్యక్షులు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి రాజేష్,సభ్యులుమహేష్, కట్టమల్లారెడ్డి, అనురాధ, అనసూయ, చంద్రశేఖర్, భాస్కర్, రాజు దీంతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

**వనపర్తి టౌన్,జనవరి6,ప్రభాతవార్త:** 13 వార్డులో కౌన్సిలర్ పుట్టపాకల.మహేష్ ఆధ్వర్యములో రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలు ఇంటింటికీ పంపడం జరిగింది.అదేవిధంగా 22 వార్డు నందు రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలు మాజీ కౌన్సిలర్,నందిమల్ల.శారద భక్తి ప్రపత్తులతో దర్శించుకున్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పి.సరిత,రఘు,నంద.రమేష్,మోహన్ కుమార్,ఎర్ర శేఖర్,దశరథ,చంద్రమౌళి పాల్గొన్నారు.



రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ

## విశ్వ విద్యాలయ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన సీఎం ప్రత్యేక కార్యదర్శి



ఐటిఐ కళాశాలను పరిశీలిస్తున్న సీఎం ప్రత్యేక కార్యదర్శి రాణికుముదిని

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 06 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని శనివారం సీఎం ప్రత్యేక కార్యదర్శి రాణి కుముదిని పరిశీలించారు. హైదరాబాద్ నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గికి చేరుకున్న ఆమె మండలంలోని నాసన్ పల్లి గ్రామ సమీపంలో గల 12 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం కోస్గి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఐటిఐ కళాశాలను కూడా ఆమె పరిశీలించారు. వీటితో పాటు కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హకీంపేట గ్రామ సమీపంలోని మరో ప్రభుత్వ స్థలాన్ని సైతం విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం పరిశీలించారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, కోస్గి తహసిల్దార్ శ్రీనివాసులు, ఆయా మండలాల ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యాభివృద్ధికి మిత్ర చేయూత



**కల్వకుర్తి, జనవరి 06 ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థిని విద్యాభివృద్ధికి మిత్ర ఫౌండేషన్ చేయూతనిచ్చింది. శనివారం కల్వకుర్తి పట్టణంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ కుమార్తె ఉన్నత చదువులకు మిత్ర ఫౌండేషన్ అండగా నిలిచి రూ.5వేల ఆర్థిక చేయూతనందించింది. భవిష్యత్తులో కూడా విద్యార్థిని విద్యాభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలను మిత్ర ఫౌండేషన్ ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో గంజాయి పట్టివేత



**నారాయణపేట ప్రతినిధి,జనవరి 06 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా పరిధిలో గంజాయి నిర్మూలన ప్రధాన ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో శనివారం మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిగుండ్ల గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ప్రబిననాయక్ తండ్రి గౌరంగ్‌నాయక్ అనే వ్యక్తి కవర్‌లో గంజాయి పెట్టుకొని ఉండగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి అతని వద్ద నుండి గంజాయి పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్ప గించడం జరిగిందని తెలిపారు. మక్తల్ సిఐ రామ్‌లాల్, ఎస్సై పర్వతాలు నిందితుని విచారించగా అతను ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి గుడిగండ్ల శివారులోని ఇటుకబట్టీలు గత నాలుగు సంవత్సరాలు నుండి పని చేస్తుం డగా ప్రస్తుతం అతని వద్ద నుండి 420 గ్రాముల గంజాయి పట్టుకుని నింది తుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని సిఐ రామ్‌లాల్, ఎస్సై పర్వతాలు తెలిపారు.

## గద్వాల తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు



**గద్వాల ప్రతినిధి,జనవరి6 ప్రభాతవార్త :** ఇటిక్యాల మండలం తహసిల్దార్‌గా పని చేసిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లి గద్వాల తహసిల్దార్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. గద్వాల్‌లో తహసిల్దార్‌గా పని చేస్తున్న నరేందర్ ఇటి క్యాల తహసిల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఇద్దరు తహసిల్దార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో రాజోలి తహసిల్దార్ శ్రీనివాస్‌శర్మ, డిటిలు ఝాన్సిరాణి, విజయ కుమార్, అధికారి మృదుల వర్షిణి, ఆర్ఐలు వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భరోసా సెంటర్‌లో దరఖాస్తుల ఆహ్వానం

### కాంట్రాక్టు పద్ధతిలో నియామకం

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 06 ప్రభాతవార్త:** భరోసా సెంటర్‌లో వివిధ రకాల పోస్టులకు అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా భద్రత విభాగం (ఉమెన్స్‌ప్రొటెక్షన్ సెల్)భరోసా సెంటర్ల నందు కాంట్రాక్ట్ బేసిస్‌లో రాష్ట్రం, జిల్లాలోని ఐదు రకాల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పోస్టుల వివరాలు, అర్హత ఇలా ఉన్నాయి...కౌన్సిలర్ కం సెంటర్ కో ఆర్డినేటర్ 10 పోస్టులు, విద్యార్హత ఎంఎస్‌సి ఇన్ సైకాలజీ లేదా ఎంఎ ఇన్ సైకాలజీ లేదా మాస్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేసి ఉండాలి. నెలవారి పారితోషికం రూ. 25 వేలు+5 వేలు చెల్లించబడుతుంది. 2. రిసెప్షనిస్టు పోస్టులు 12 కలవు, విద్యార్హత, డిగ్రీ కంప్యూటర్ లిటరేచర్, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ వచ్చి ఉండాలి. వీరికి నెలవారి పారితోషికం రూ. 15 వేలు. 3. సపోర్టింగ్ పర్సన్ 32 పోస్టులు కలవు. విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేట్ (సోషల్ వర్క్/ చైల్డ్ డెవలప్‌మెంట్ సైకాలజీ నెలవారి పారితోషికం రూ.20వేలు. 4. లీగల్ సపోర్టు పర్సన్ 17 పోస్టులు కలవు. విద్యార్హత ఎల్ఎల్‌బి ఎల్ఎల్ఎం నెలవారి పారితోషికం రూ. 22 వేలు. 5. ఎఎన్ఎం పోస్టులు 12. విద్యార్హత బిఎస్సీ నర్సింగ్ లేక జిఎన్ఎం లేక ఎఎన్ఎం, నెలవారి పారితోషికం రూ. 16 వేలు ఉంటుంది. పైన కనబర్చిన అర్హత లేక మహిళలకు ఈనెల7 నుండి 10వ తేదీ వరకు లోగా తమ దరఖాస్తులను, అర్హత గల సర్టిఫికెట్‌లను జతపర్చి జిల్లా పోలీసు కార్యాలయం (డిపిఓ)లో సమర్పించాలని ఎస్పీ తెలిపారు.

## రైతు వేదికలో చెంచులకు ఆధార్ నమోదు

**లింగాల,జనవరి 06 ప్రభాతవార్త:** మండలంలోని మారుమూల ప్రాంతంలో జీవనం సాగిస్తున్న చెంచులకు ప్రధానమంత్రి జన్‌మాన్ ఆధార్ నమోదు కార్యక్రమం శనివారం రెండవ రోజు కొనసాగింది. చెంచులకు జన్‌మాన్ ఆధార్ నమోదు కార్యక్రమం మన్ననూరు ఐటిడిఎ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ ఆధార్ నమోదుతో పాటు బ్యాంకు ఖాతా కూడా చేస్తున్నట్లు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అధికారి శివ, శివాంజనేయులు తెలిపారు. ఉచిత ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఐటిడిఎ ఆధ్వర్యంలో చెంచులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

# ముగిసిన గడువు

- గామసభల్లో అంచనాలకు మించిన అభ్యర్థనలు..
- భూత్పూర్‌లో మొత్తం 16వేలకు పైగా ధరఖాస్తుల స్వీకరణ..
- భూత్పూర్ మున్సిపాలిటీ పది వార్డులలో 4998 ధరఖాస్తులు..
- భూత్పూర్ మండలంలో 11వేలకు పైగా ధరఖాస్తులు..
- ఆరు గ్యారంటీల అమలు దిశగా కాంగ్రెస్ అడుగులు..



అమిస్తాపూర్ ప్రజాపాలనలో పాల్గొని ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,జనవరి 6,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం గత నెల 28నుంచి జనవరి 6వరకు నిర్వహించిన ప్రజా పాలన పేరిట గ్రామసభల్ని విస్తృతంగా నిర్వహించి ప్రజల నుంచి ధరఖాస్తుల్ని స్వీకరించింది. ఈ క్రమంలో భూత్పూర్ మండలంలోని 18గ్రామాలు,మున్సిపాలిటీలోని పదివార్డులలో మొత్తం 16వేలకు పైగా ధరఖాస్తులను స్వీకరించారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల



నుంచి 11వేలకు పైగా ధరఖాస్తుల్ని స్వీకరించగా భూత్పూర్ మున్సి పాలిటి పట్టణంలోని 19వార్డుల నుంచి 4998ధరకాస్తులను స్వీకరించారు. మండలంలోని ఎమ్మార్వో యు రాజు పరిధిలో భట్టుపల్లి,పాతమొల్గర, కొత్తమొల్గర, ఎల్కిచర్ల,కప్పెట, మద్దిడట్ల, చౌలతండా,కరివెన,తాటిపర్తి గ్రామాలు కాగా,ఎంపిడీఓ మున్నిబేగం పరిధిలో పోతులమడుగు,శేరుపల్లి,హస్నాపూర్,రావులపల్లి,అన్నాసాగర్,తాటికొండ,లంబడికుంట తండా,కొత్తూర్,పెద్దతండా తదితర గ్రామాలు,తండాలలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ఎక్కువ శాతం మహాలక్ష్మి పింఛన్లు,రు.500లకే గ్యాస్ సిలెండర్లు,200యూనిట్ల ఉచిత విద్యుత్తు,చేయూత పథకం ద్వారా వృద్ధాప్య,వికలాంగులు,వితంతు పింఛన్ల కోసమే ప్రజలు అధికంగా ధరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక భూత్పూర్ మున్సిపాలిటీలోని పది వార్డులలో మొత్తం 4998ధరఖాస్తులు వచ్చాయి. ఒకటో వార్డులో 460. రెండో వార్డులో 501,మూడో వార్డులో 512,నాల్గో వార్డులో 532,ఐదో వార్డులో 574,ఆరో వార్డులో 417,ఏడోవార్డులో 453,ఎనిమిదో వార్డులో 526,తొమ్మిదో వార్డులో 537,పదో వార్డులో 477 ధరఖాస్తులు మొత్తం మున్సి పాలిటీలోని పది వార్డులలో 4998దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు. వారం రోజుల పాటు పల్లెలు,పట్టణాలలో ధరఖాస్తుల జాతరలా సాగిన కాంగ్రెస్ ప్రజాపాలన కార్యక్రమంలో శనివారంతో ముగిసింది. ధరఖాస్తు చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాలు అందుతాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని వారు స్పష్టం చేశారు. భూత్పూర్‌లో ప్రజాపాలన పేరిట ప్రభుత్వం నిర్వహించిన గ్రామ సభలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ జి రవినాయక్,తహసిల్దార్ యురాజు,ఎంపిడీఓ మున్నిబేగం, కమిష నర్ నూరుల్ నజీబ్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు పాల్గొని ప్రజల నుంచి ధరఖాస్తుల స్వీకరణకు సహకరించారు.

## సంక్రాంతి పండగకు ముత్యాల ముగ్గులు సంప్రదాయం

### విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



ముత్యాల ముగ్గులు వేసిన మహిళలు

**ఇటిక్యాల,జనవరి 06 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగకు గ్రామాలలో సంస్కృతికి సంప్రదాయానికి మహిళలు ఇంటిముందు రంగులవల్లిగా ముత్యాల ముగ్గులు వేయడం సాంప్రదాయంగా మారిందని ముగ్గులు వేయడంలో మహిళలు ఎంతగానో రాణిస్తున్నారని ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. అలాగే పదవ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగే ముత్యాల ముగ్గుల పోటీలకు కూడా ఇక్కడ గెలుపొందిన విజేతలను దగ్గరుండి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని స్థానిక సర్పంచ్‌ను, ఎంపిటిసిని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలోని పదవ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించగా గెలుపొందిన విజేతలకు కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సోమనాద్రి బహుమతులను ఇచ్చేందుకు దాతగా ముందుకు వచ్చారు. జిల్లాస్థాయి ముత్యల ముగ్గుల పోటీలలో దాదాపు 55 మంది మహిళలు ముగ్గులు వేయగా అందులో ప్రతిభ కనబర్చిన ముగ్గురు మహిళలను విజేతలుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పదవ బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య హాజరు కాగా పోతురాజు సోమనాద్రి ఆయన సతీమణి సరిత వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదటి విజేత వరలక్ష్మి యాపర్లకు రూ. 6 వేలు, రెండవ విజేత బి.సునిత పెబ్బేరు రూ. 4 వేలు, మూడవ విజేత కొండేరుకుచెందిన అరుణ రూ. 3వేలు విజేతలుగా ఎంపిక కాగా మొదటి బహుమతిని రూ. 6 వేలను అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంతప్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. మరో విజేతకు దాత పోతురాజు సోమనాద్రి ఆయన సతీమణి సరితలు అందజేశారు. మరో ఇద్దరు విజేతలకు కన్సొలేషన్ బహుమతులుగా వెంకటేష్ యాదవ్, రాధా బజారన్న ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు. అలాగే గద్వాలకు చెందిన సింధుజ సారీహౌజ్ సెంటర్ నుండి మరో ఇద్దరు విజేతలకు రెండు చీరలను బహూకరించారు. ఈ కార్యకమంలో పదవ బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, సర్పంచ్ రవి, ఎంపిటిసి నీలి లక్ష్మి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, మాజీ జడ్పీటిసి మద్దిలేటి వెంకటేష్‌యాదవ్, శ్యాంరావు, రాజ్‌కుమార్, మెడికల్ మద్దిలేటి, మధునాయుడు, గోపాల్‌దిన్నె సత్యం, గుమ్మ గోవర్ధన్, యువరాజు, ఆయా మండలా ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మొదటి విజేతకు బహుమతులు అందజేస్తున్న సంపత్‌కుమార్

## బిల్లులు ఆపారని ఉప సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

### - నవాబుపేట మండలం దేపల్లిలో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాతవార్త :** గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో ఓ ఉప సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే..మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం దేపల్లి ఉప సర్పంచ్ యశోద భర్త దామోదర్ గ్రామ పంచాయతీ నుంచి తీర్మాణం చేసుకొని అగ్రిమెంట్ ఆధారంగా రూ.3లక్షలకు పైగా అప్పుతెచ్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ఈమేరకు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఎంబీ బుక్ రికార్డ్ చేస్తే పంచాయతీ నిధుల నుంచి బిల్లులు చెల్లిస్తారు. జీపీలో ఆర్థికసంఘం నిధులు ఎంబీ రాసి డీఈఈ చెక్ మెజర్‌మెంట్ అయిన తదుపరి బిల్లులు మంజూరు చేస్తారు. సదరు బిల్లులకు సంబంధించి ఎంబీ రికార్డు చేయాల్సి ఉన్నది. అయితే ఎంబీ రికార్డు చేయాలని సదరు ఏఈ రాములును దామోదర్ పలుమార్లు అడిగినా చేయలేదు. ఈక్రమంలో బిల్లులు మంజూరు చేయడంలేదని ఆవేదన చెంది మనస్తాపానికి గురై తన అత్తగారి గ్రామం కొండారెడ్డిపల్లి నుంచి వస్తూ మార్గ మధ్యలో జడ్చర్ల సమీపంలోకి రాగానే తన వెంట తెచ్చుకున్న క్రిమీ సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇదే విషయమై ఏఈని వివరణ కోరగా ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్‌రెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు బిల్లులు కొన్ని రోజులు ఆపాలని చెప్పడంతో కొంత ఆలస్యం జరిగిందని కానీ ఎంబీ తాను రికార్డు చేశారనని సోమవారం బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న దామోదర్

## ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన వారికి అందిస్తాం

### ఉండవెల్లి మండల కేంద్రంలో ప్రజా పాలనలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**ఇటిక్యాల,జనవరి 06 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన వారికి వంద రోజుల్లోనే అమలు చేస్తామని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. శనివారం ఉండవల్లి మండల కేంద్రంలో జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమానికి ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువయ్యే భాగంలో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని గ్రామాలలోకి మీ వద్దకే అధికారులు వచ్చి లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో పాల్గొన్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

## ప్రత్యేక ఓటరు సవరణ జాబితా విడుదల

### ఓటరు జాబితాను రాజకీయ ప్రతినిధులకు అందజేత

**గద్వాల ప్రతినిధి,జనవరి 06 ప్రభాతవార్త:** ప్రత్యేక సవరణ ఓటర్ల జాబితాను అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్‌లతో కలిసి జాబితాను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్‌విడుదల చేశారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో రాబోయే ఎన్నికలు 2024 కోసం రాజకీయ ప్రతినిధులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు ప్రత్యేక ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈనెల 22 వరకు మార్పులు, చేర్పులు, సవరణలు ఉంటే సంబంధిత తహసిల్దార్లు, బిఎల్ఓలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సవరణ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను స్వీకరిస్తామని అన్నారు. ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల అవుతుందని తెలిపారు. అనంతరం పిజెపి క్యాంపు ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను రాజకీయ ప్రతినిదుల సమక్షంలో ఓపెన్ చేసి ఈవిఎంలు, వివి ప్యాట్లను స్కాన్‌చేసి ఎన్నికలకు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, సీ సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్, ఆర్ఐ వెంకటేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఓటరు జాబితాను రాజకీయ పార్టీల ప్రతినెలకు అందజేస్తున్న అదనపు కలెక్టర్లు

## కాంగ్రెస్ నాయకుడికి సతీ వియోగం

**భూత్పూర్,జనవరి 6,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు అమిస్తాపూర్‌కు చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు హమీద్‌మియ భార్య రహిమాబేగం శనివారం గుండెపోటుతో మృతి చెందగా, విషయం తెల్సుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ అమిస్తాపూర్‌లోని మృతురాలి ఇంటికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించి ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడు హమీద్ మియాకుతన వంతు సహాయంగా రు.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్ర మంలో నరేందర్, ఎర్రబాలప్ప, శివరాములు, పద్మయ్య, పాష,జహంగీర్, అఫ్రోస్,మల్లేష్,ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## దేశ విద్యారంగ పరిరక్షణకై 12న ఛలో పార్లమెంట్

**వనపర్తి టౌన్,జనవరి 6,ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వనపర్తి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ హాజరై మాట్లాడారు. అనంతరం చలో పార్లమెంటు పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిఎం.ఆది,జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి, నాయకులు మల్లేష్,నంద కిషోర్,ప్రవీణ్,లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## నిందితుడిని రిమాండ్ తరలింపు



**కొత్తకోట,జనవరి 6,ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకున్ని పోలీసులు పట్టుకొని విచారించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పేరు ఖాజా పీరా అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన ఖాజా ఫిరా అని తెలిపారు. ఇతన్ని పూర్తిగా విచారించగా డిసెంబర్ నెలలో కొత్తకోటలోని వనపర్తి రోడ్లో రాఘవేందర్ శెట్టి ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అలాగే గతంలో అనంతపూర్ జిల్లాలో 8 దొంగతనాలు,కడప రాయచోటిలో 4దొంగతనాలలో ముద్దాయిగా ఉన్నాడని తెలిపారు. అతని దగ్గర నుండి 3 తులాల బంగారు 20 వేల నగదు రికవరీ చేసి రిమాండ్ చేసి జిల్లా కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విచారణలో పాల్గొన్న హెచ్ కానిస్టేబుల్ కుర్మయ్య గౌడ్,మురళీధర్ రెడ్డి,రవిలను ఎస్సై అభినందించారు.

## మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం..

### - 32మంది కౌన్సిలర్ల తిరుగుబాటు



కలెక్టరేట్‌కు చేరుకున్న కౌన్సిలర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతో పాటు వైస్ చైర్మన్ తాటి గణేశ్‌పై అవిశ్వాసానికి కౌన్సిలర్లు నిర్ణయించారు. ఈమేకు అన్ని పార్టీలకు చెందిన 32మంది కౌన్సిలర్లు కలిసి శనివారం మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్‌ను కలిసి అవిశ్వాసానికి అనుమతి కోరారు. ఈమేరకు అవిశ్వాస తీర్మాణానికి చెందిన పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈమేరకు గత నాలుగేండ్లుగా మున్సిపల్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, మున్సిపల్ శాఖ పరంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదంటూ మున్సిపల్ చైర్మన్ నిర్లిప్త వైఖరికి నిరసనగా నిర్ణయం తీసుకుననట్లు చెప్పారు. తక్షణమే చైర్మన్‌ను తొలగించాలంటూ తీర్మాణం చేసి కలెక్టర్‌కు అందజేశారు. తమకు కొత్త చైర్మన్‌ను ఎంపిక చేసుకుంటామని నిర్ణయం తీసుకున్నారు. గతంలో చాలా ఇబ్బందులు పడ్డామని ప్రశాంతంగా ఒకయ నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి తమ వార్డుల వారీగా పనులు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 06 ప్రభాతవార్త:** 9 నెలలుగా తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ధరణి కోఆర్డినేటర్ సంపత కుమార్ ఆధ్వర్యంలో ధరణి ఆపరేటర్లతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కొరకై ఇతరత్ర భూ సంబంధిత సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి తేదీ:23-05-2018న సుమారుగా 23 మంది కంప్యూటర్ ఆపరేటర్స్‌పాటు జిల్లా కోఆర్డినేటర్లుకు నియమించారన్నారు. నెలవారి సమయంలో సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, ఒక నెల ఎక్కువ, ఒక నెల తక్కువగా చెల్లిస్తుండేవారని, గత9 నెలలుగా జీతాలు నిలిచి పోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ధరణి ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.